
ఉప్పునుంతల : లత్తీపూర్ చిలకల వాగు


పెంట్లవెల్లి : మంచాలకట్టలో ప్రవహిస్తున్న వాగు


బిజినేపల్లి : అలుగుపారుతున్న పాలెం పెంటోని చెరువు


అమ్రాబాద్ : అలుగుపారుతున్న లోకేశ్వరం చెరువు


బల్మూర్ : జినుకుంటలో మత్తడి పోస్తున్న ఊరచెరువు


తాడూరు : సబ్‌స్టేషన్‌లోకి చేరిన నీరు


కోడేరు : వరద నీటిలో మునిగిన వరి పంటలు


నాగర్‌కర్నూల్ జిల్లాలో అలుగుపారుతున్న చెరువు

# మూడు రోజులుగా వీడని వాన

- అలుగుపారుతున్న చెరువులు, కుంటలు
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- సహాయక చర్యల్లో అధికారులు


కల్వకుర్తి : పంజుగుల- తుర్కలపల్లి మధ్య అలుగుపారుతున్న కత్వ


కల్వకుర్తి రూరల్ : తర్నికల్ వాగు వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్

ఉప్పునుంతల, సెప్టెంబర్ 1 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు, కుంటలు, వాగులు నిండి అలుగులు పారుతున్నాయి. మండలంలోని మొల్గర సమీపంలో ఉన్న దుందుభీ వాగు పరవళ్లు తొక్కుతుంది. ఆదివారం నుంచి ఉప్పునుంతల-వంగూర్ మండలాల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఉప్పునుంతల మీదుగా కల్వకుర్తి వైపు వెళ్లే ప్రజలు మరో దారి చూసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మొల్గర వద్ద కాజేవేపై నీరు ఉధృత్తంగా ప్రమాదకరంగా ప్రవహిస్తుంది. ఎవరైనా వాగును దాటేందుకు ప్రయత్నిస్తే ప్రమాదాల బారిన పడతారని పోలీసులు హెచ్చరిస్తూ బారికేడ్లను ఏర్పాటు చేశారు. అదే విధంగా గొల్లవాగు, చిలకలవాగు, మహసముద్రం చెరువు, మామిళ్లపల్లి చెరువు, పోలెం చెరువు నిండి అలుగు పారుతున్నది.

**పెంట్లవెల్లి మండలంలో..**

పెంట్లవెల్లి, సెప్టెంబర్ 1 : మండలంలో ఎడతెర్పి లేకుండా కురుస్తున్న వార్షానికి ఆదివారం మండల కేంద్రంలోని చౌట చెరువు, కొండూరులోని ఊర చెరువు, బాపనికుంట చెరువులు అ లుగు పారాయి. అదేవిధంగా మంచాలకట్ట, మాదవస్వామి నగర్ గ్రామాల సమీపంలో వాగు ఉధృతంగా పొంగి పారుతున్నారు. కృష్ణా నదీ తీరం సమీపంలోని జటప్రోల్, మంచాలకట్ట, మాదవస్వామి నగర్, వెంకల్, మల్లేశ్వరం గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, పోలీస్ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

**బిజినేపల్లి మండలంలో..**

బిజినేపల్లి, సెప్టెంబర్ 1 : మండలంలోని పాలెం పెంటోని చెరువు, ఖానాపూర్, శాయిన్‌పల్లి తదితర గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండి అలుగుపారుతున్నాయి. పాలెం గ్రామంలో ప్రవీణ్ చెందిన ఇళ్లు వర్షానికి కూలిపడింది. లట్టుపల్లి గ్రామ సమీపంలో కేఎల్ఐ కాల్వ తెగడంతో సుమారు 300 ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి.

**అమ్రాబాద్ మండలంలో..**

అమ్రాబాద్, సెప్టెంబర్ 1 : ఎడతెరిపిలేని వానలకు అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లో ఆదివారం చెరువులు, వాగులు, వంకలు అలుగుపారుతున్నాయి. మండల కేంద్రంలోని లోకేశ్వరం చెరువు మత్తడి ఎక్కి పారుతుంది. అమ్రాబాద్ మండలంలోని కుమ్మరోనిపల్లి చెరువు అలుగుపారి కాజ్వేపై నీరు ప్రవహిస్తుండటంతో అమ్రాబాద్-పదర మండలాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. వంగురోనిపల్లిలో వర్షానికి ఆనంద్ ఇళ్లు పూర్తిగా కూలిపోయింది. వాతావరణశాఖ నాగర్‌కర్నూల్ జిల్లాను రెడ్ జోన్‌గా ప్రకటించడం ద్వారా అమ్రాబాద్, పదర ఉమ్మడి మండలాల్లోని అన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి మండలాల ఎంపీడీవోలు బాలచంద్రస్రుజన్, శంకర్‌నాయక్‌లు ఆదివారం తెలిపారు. అదేవిధంగా పదర మండలంలోని వంకేశ్వరం గ్రామంలో గల ఎస్సీ కాలనీలోని ఇండ్లను ఎంపీవో వెంకటయ్య పరిశీలించారు. పాత ఇండ్లల్లో ఉండొద్దని, వర్షాల ప్రభావంలో వ్యాధులు వ్యాపిస్తాయని తాగునీటిని వేడిచేసి చల్లార్చి తాగాలని, వేడి ఆహారపదార్థాలను స్వీకరించాలని గ్రామంలో డప్పుకొట్టి తెలియజేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో అమ్రాబాద్ ఇన్‌చార్జ్ తాసీల్దార్ రావూఫ్, పదర ఏఎస్సై బాలునాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**బల్మూరు మండలంలో..**

బల్మూరు, సెప్టెంబర్ 1 : కురుస్తున్న భారీ వర్షలకు మండలంలోని చెరువులు, కుంటలు నిండి అలుగుపారుతున్నాయి. అచ్చంపేట-బల్మూరు రోడ్డుపై పెద్ద వృక్షం విరిగిపడడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. బల్మూరు-గోదల్, అచ్చంపేట-బాణాల తదితర ప్రధాన రోడ్లపై వర్షపు నీరు రవడంతో అధికారులు రోడ్లను బ్లాక్ చేశారు.

**తాడూరు మండలంలో..**

తాడూరు, సెప్టెంబర్ 1 : మండలంలో కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరుకున్నది. ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలు అలుగులు పారుతున్నాయి.

**కోడేరు మండలంలో..**

కోడేరు, సెప్టెంబర్ 1 : కోడేరు మండలంలో కురుస్తున్న వర్షాలకు పాత ఇండ్లు కూలిపోతున్నాయి. ఆదివారం కోడేరు మండలంలో 12 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తాసీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని నాగులపల్లితండాలో మట్టి మిద్దె కూలిపోయినట్లు తాసీల్దార్ విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రావణ్‌కుమార్‌లు తెలిపారు. మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు కోడేరు, పసుపుల, బావాయిపల్లి, మాచుపల్లి, ఖానాపూర్ గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కోడేరు పసుపుల, కోడేరు ఖానాపూర్, బావాయిపల్లి దేవల్‌తిర్మలాపూర్, మాచుపల్లి సింగాయిపల్లి, మాచుపల్లి ఏదుల రహదారుల గుండా వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో కోడేరు పోలీసులు రెవెన్యూ అధికారులు ఆయా వాగుల వద్ద కంపవేసి రక్షణ చర్యలు చేపట్టారు. ఆయా గ్రామాల్లో వరి పంటలు నీటిలో మునిగాయి.

**కల్వకుర్తి మండలంలో..**

కల్వకుర్తి/కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 1: రెండు రోజులుగా కు రుస్తున్న వానకు కల్వకుర్తి మండలంలో వాగులు వంకలు వర్షపు నీటితో ఉరకలు వేస్తున్నాయి. పాతమట్టి మిద్దెలు వర్షాలకు నాని కూలిపోతున్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో ప్రధానమైన 29వ కాల్వ వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుంది. తర్నికల్, పంజుగులలో కత్వాల నుంచి నీరు అలుగు పారుతుంది. దుందు భీ వాగు పరవళ్లు తొక్కుతుండడంతో రఘుపతిపేట వద్ద అధికారులు బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను బంద్ చేశారు. పంజుగుల, తుర్కలపల్లి మధ్య కత్వ పొంగి ప్రవహిస్తుండడంతో గ్రామా ల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కల్వకుర్తి- నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారిపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. కలెక్టర్ సంతోష్‌తోపాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు అక్కడకు చేరుకుని జేసీబీతో కాల్వ తవ్వించి రాకపోకలకు ఇబ్బందులు లే కుండా చూశారు. కల్వకుర్తి మున్సిపాలిటీలో గాంధీనగర్, వాసవీనగర్, లోటట్టు కాలనీలోకి వర్షపు నీరు చేరింది. మున్సిపల్ అధికారులు జేసీబీలతో వర్షపు నీరు దిగువ ప్రాంతాలకు తరలించే చ ర్యలు తీసుకున్నారు. కల్వకుర్తి మున్సిపాలిటీలోని కోట బురుజు వర్షానికి పూర్తి నానిపోయి బీటలు పట్టింది. కూలిపోయి ప్రమాదం జరుగుతుందని బురుజు చుట్టుపక్కల నివాసులు ఆందోళన వ్య క్తం చేస్తున్నారు. కల్వకుర్తి మండలం తాండ్ర, ఎంగంపల్లిలో మట్టి మిద్దెలు కూలాయి. ఎంగంపల్లికి చెందిన భగవాన్, తాండ్రకు చెందిన మహ్మద్ యూసుఫ్ మట్టి మిద్దెలు వర్షాల కారణంగా కూలాయి. సమాచారం తెలుసుకున్న తాసీల్దార్ ఇబ్రహీం ఘటనా స్థలాలకు చేరకుని బాధితులను క్షేమ ప్రదేశాలకు చేరవేయించారు.

**వంగూరు మండలంలో..**

వంగూరు, సెప్టెంబర్ 1 : కురుస్తున్న భారీ వర్షాలకు దుందుభీ వాగు పరవళ్లు తొక్కుతున్నది. మండలంలోని జాజాల, పోతారెడ్డిపల్లి, ఉల్పర, మిట్టసదగోడు, డిండిచింతపల్లి, ఉమ్మాపూర్ శివారులో దుందుభీ పరవళ్లు తొక్కుతూ పర్యాటకులను కనువిందు చేసింది. దుందుభీ ప్రవాహంతో డిండి ప్రాజెక్టు మరో 24 గంటల్లో మద్దడి దూకే అవకాశం ఉన్నది. ఆదివారం మండలంలోని డిండిచింతపల్లి వంతెన వద్ద ప్రవహిస్తున్న దుందుభీని తిలకించేందుకు పర్యాటకులు పెద్దెత్తునా తరలి వచ్చారు.

**చారకొండ మండలంలో..**

చారకొండ, సెప్టెంబర్ 1 : మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలంలో వర్షానికి కూలిన ఇండ్లను ఎంపీవో వెంకటేశ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముసురు వర్షానికి చారకొండలో గౌస్, జూపల్లిలో అంకిళ్ల రాములమ్మ, అంకిళ్ల మైసమ్మ, జంతుక బాలస్వామి మట్టి ఇండ్లు కూలినట్లు చెప్పారు. దేవిధంగా జూపల్లిలో ఆర్ఐలు రామకృష్ణ, భరత్ శిథిలావస్థ ఇండ్లను పరిశీలించారు.

**ఊర్కొండ మండలంలో..**

ఊర్కొండ, సెప్టెంబర్ 1: మండలంలోని బొమ్మరాజుపల్లి, రాంరెడ్డిపల్లి, జగబోయిన్‌పల్లి, ఊర్కొండపేట, గుడిగాన్‌పల్లిలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుంటలకు చెరువులకు వరద చేరుతుండడంతో సందడి వాతావరణం నెలకొన్నది. అలాగే ఊర్కొండపేట పరిధిలోని ఠాగూర్ తండాకు చెందిన రమావత్ జంకు మట్టి ఇల్లు కూలింది.


వంగూరు : డిండిచింతపల్లి వద్ద పరవళ్లు తొక్కుతున్న దుందుభీ

**వెల్దండ మండలంలో..**

వెల్దండ, సెప్టెంబర్ 1 : మండలంలో ఆదివారం కురిసిన వర్షానికి 90.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి రాచూర్‌లో మల్లోజు సుజాత ఇల్లు నేలమట్టమైంది. సుజాత కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. కూలిన ఇంటిని ఆర్ఐ శంకర్ పరిశీలించి, పంచనామా చేశారు. అదేవిధంగా రాచూర్‌లో అప్పాయకుంట నిండు కుండలా మారి అలుగుపారింది. వాగులు, వంకలు పొంగి పొర్లాయి.


కొల్లాపూర్ : అలుగు పారుతున్న సింగోటంలోని శ్రీవారి సముద్రం


వెల్దండ : రాచూర్‌లో పారుతున్న వాగు

## అతిభారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- సోమవారం విద్యా సంస్థలకు సెలవు
- కలెక్టర్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 1 : జిల్లాలో రాబోయే 48 గంటల పాటు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని కలెక్టర్ సంతోష్ ఆదివారం ప్రకటనలో కోరారు. వాతావరణ శాఖాధికారులు అందించిన సమాచారం మేరకు జిల్లాలో మరో 48 గంటల వరకు అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, వీటి వల్ల పెద్దెత్తున వరదలు వచ్చే ప్రమాదం ఉందని, దీనిని గమనించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సోమవారం అన్ని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం నిర్వహించే ప్రజావాణిని సైతం రద్దు చేస్తున్నట్లు తెలిపారు. అతిభారీ వర్షాల నేపథ్యంలో అధికారులు కూడా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అధికారి హెడ్‌క్వార్టర్‌లో ఉండాలన్నారు. భారీ వరదలు వచ్చే నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలన్నారు. అత్యవసరమైతే తప్పా ఎవరు బయటకు వెళ్ళకూడదన్నారు. మత్స్యకారులు కృష్ణానదిలో, చెరువు, కుంటల్లో చేపల వేటకు వెళ్లకూడదని సూచించారు. ఆదివారం కల్వకుర్తి మండలంలోని తర్నికల్ గ్రామం వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నది నీటిని పరిశీలించి నాగర్‌కర్నూల్-కల్వకుర్తికి ప్రయాణించే కార్లు, బైకులను అనుమతించొద్దని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదివారం ప్రకటనలో సూచించారు. సమీపంలోని వాగు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ఉండే కరెంటు స్తంభాల వద్ద, స్విచ్ బోర్డ్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, ఉరుములు, మెరుపులతో వర్షం వచ్చినప్పుడు చెట్లకింద ఉండకూడదని సూచించారు. ఇంకా తుఫాన్ ప్రభావం రెండురోజులు ఉన్నందున అవసరమైన నిత్యావసర సరుకులు, మందులు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు.

### రేపటి ప్రజావాణి రద్దు

జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంతోష్ ఆదేశించారు. జిల్లాలో భారీ వర్షాల కారణంగా చెరువులు, వాగులు, వంకలు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, అధికారులు అత్యవసర విధుల్లో నిమగ్నమైనందున సోమవారం జిల్లా, మండలస్థాయిలో జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి ప్రజావాణి కార్యక్రమానికి ఎవరూ రావద్దని సూచించారు. మండల కేంద్రాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండి పరిస్థితులను పర్యవేక్షించాలని, మండల ప్రత్యేకాధికారులు వారి నిర్ధిష్ట మండల్లాల్లోనే ఉండి వివిధ విభాగాలతో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## తిమ్మాజిపేటలో కుంభవృష్టి

తిమ్మాజిపేట, సెప్టెంబర్ 1 : తిమ్మాజిపేట మండలంలో రెండో రోజు కుంభవృష్టి కురిసింది. ఆదివారం మండలంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగి పొరలుతున్నాయి. మండలంలో ఒకేరోజు 13.2 సె.మీటర్ల వర్షం పాతం నమోదు అయింది. ఈ వర్షానికి భారీగా నీరు చేరడంతో నేరళ్లపల్లి నడుపులమ్మ కట్ట ప్రమాదపు అంచున ఉండడంతో తాసీల్దార్ మోహన్, నీటి పారుదల శాఖాధికారులు అక్కడికి వెళ్లి చెరువు అలుగును తొలగించి నీటిని వదిలివేశారు. మరోవైపు ఎదిరేపల్లిలో గౌని చెరువుకు స్వల్పంగా గండిపడిపట్లు రైతులు తెలిపారు. వారి అప్రమత్తంతో ప్రమాదం తొలగింది. మండలంలోని వివిధ గ్రామాల్లో తొమ్మిది ఇండ్లు నేలమట్టమయ్యాయి. మరోవైపు తిమ్మాజిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ కూలిపోయింది. ఇప్పలపల్లిలో వర్షం నీరు ఉధృతికి అలుగును తొలగించి నీటిని వదిలారు. జడ్చర్ల-నాగర్‌కర్నూల్ వయా ఆవంచ రహదారిలో బుద్ధసముద్రం వద్ద నీటి ఉధ్రితి పెరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. తాసీల్దార్ మోహన్ వివిధ గ్రామాల్లోని చెరువుల వద్దకు వెళ్లి పరిశీలించారు.


నేరాలపల్లి చెరువు వద్ద పరిస్థితులను పరిశీలిస్తున్న తాసీల్దార్

**కొల్లాపూర్‌లో..**

కొల్లాపూర్, సెప్టెంబర్ 1 : కొల్లాపూర్ పరిధిలో శుక్రవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దాటికి కొల్లాపూర్‌లోని చెరువులు కుంటలు అలుగుపారాయి. మండల పరిధిలోని సింగోటం సమీపంలో కొల్లాపూర్-వనపర్తి ప్రధాన రహదారి వెంట చెట్లు నేలకు ఒరగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సింగోటంలోని శ్రీవారి సముద్రం 2009 తర్వాత మళ్లీ ఇప్పుడు భారీ ఎత్తున అలుగు పారడంతో మండల పరిధిలోని సింగోటం, మాచినేనిపల్లి, జవాయిపల్లి, రామాపురం, ఎన్మన్‌బెట్ల, చౌటబెట్ల నుంచి పెంట్లవెల్లి మండలం వరకు వందలాది ఎకరాల్లో వరి పంటలు వరదనీటిలో మునిగిపోయాయి. నార్లాపూర్, ముక్కిడిగుండం గ్రామాల సమీపంలోని పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో ముక్కిడిగుండానికి రాకపోకలు నిలిచిపోయాయి.

## గ్రామాల్లో అధికారుల పర్యటన


నాగులపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న అధికారులు

కోడేరు, సెప్టెంబర్ 1 : మండల కేంద్రంలోపాటు నాగులపల్లి, నాగులపల్లితండాలను ఆదివారం స్థానిక తాసీల్దార్ విజయ్‌కుమార్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో శ్రావణ్‌కుమార్, ఇరిగేషన్ శాఖ ఏఈ లక్ష్మి సందర్శించారు. రెండు రోజులుగా మండలంలో భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలను అప్రమత్తం చేయటానికి ఆయా గ్రామాల్లో పర్యటించి పాడుబడిన ఇండ్లు ఉంటే వాటిని కూల్చివేయాలని అలాగే మట్టి మిద్దెలలో ఎవరు నివాసం ఉండకూడదని ప్రజలకు సూచించారు. గ్రామాల సమీపంలో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నందున ఎవరు బయటికి రావద్దని తెలిపారు. నాగులపల్లి గ్రామానికి అనుకొని ఉన్న ఎంజీకేఎల్ఐ కాలువ నీటి ఉధృతికి ఎక్కి పారుతుండడంతో నల్లా చెరువులోకి నీళ్లు వెళ్లే విధంగా గండి పెట్టించినట్లు వారు తెలిపారు. ముత్తిరెడ్డిపల్లి సమీపంలో కూడా కాలువ తెగిపోకుండా ఉండేందుకు వాగు సమీపంలో కాలువకు గండి పెట్టించినట్లు వారు చెప్పారు. వీరి వెంట రెవెన్యూ సిబ్బంది సురేందర్, జంబులయ్య పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డి

## సొరంగంలోకి వరదనీరు

నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 1: గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాల కారణంగా నాగర్‌కర్నూల్ మండలంలోని పలు గ్రామాలు జలదిగ్భందమయ్యాయి. మండలంలోని శ్రీపురం దగ్గర ఉన్న పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగంలోకి వరదనీరు చేరింది. సొరంగం సమీప గ్రామాలైన శ్రీపురం, బొందలపల్లి, తూడుకుర్తి గ్రామాలు వరదనీటితో జలదిగ్భంధం కావడంతో ఊహించని విధంగా ఆనకట్ట తెగి సొరంగంలోకి వరదనీరు చేరుకుంది. వరదనీరు చేరడంతో భారీ నష్టం వాటిల్లే అవకాశాలు ఉన్నట్లు ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు.


కోడేరు : నాగులపల్లితండాలో కూలిన మట్టి మిద్దె


అమ్రాబాద్ : వంగురోనిపల్లిలో వానకు కూలిన ఇళ్లు

SHRIRAM Finance వాహనములు అమ్మబడును

| SNo. | VEHICLE NO. | DISCRIPTION | MODEL |
|---|---|---|---|
| 1 | TS07GJ-5669 | SWIFT DZIRE VDI DIESEL 5 SEATER | 2016 |

పై వాహనం తేది : 03-09-2024 నాడు వేలం వేయబడును
అడ్రస్: శ్రీరామ్ ఆటో మాల్ యార్డ్, భూత్పూర్, మహబూబ్‌నగర్
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
హౌస్ నెం.20-15/4/A/1, 1వ అంతస్తు, శ్రీ లక్ష్మి నరసింహా స్వామి కాంప్లెక్స్, LIC ఆఫీస్ ప్రక్కన, నాగర్‌కర్నూల్ రోడ్, అచ్చంపేట -509375. నాగర్‌కర్నూల్ జిల్లా. తెలంగాణ రాష్ట్రం. సెల్: 98483 21685

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FARM PLOTS SALE
★బాలానగర్ జడ్చర్ల బెంగళూరు హైవేకి గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో & యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ఫ్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో ప్లాట్లు కలవు. స్పాట్ రిజి।। 7780483434.
NT-332573

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748